20 CTR 2:20 CTR 2.qxd 7/19/2026 11:07 PM Page 1



# జడ్పీటీసీ, ఎంపిపి రిజర్వేషన్లపై విస్తృతంగా చర్చ

**యాదమరి, జులై 19 ప్రభాతవార్త:**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధం అవుతుండటంతో మండలంలో జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికలపై విస్తృతంగా చర్చ ప్రారంభమైంది. జడ్పీటీసీ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు జడ్పీటీసీలుగా ఏ వర్గాలకు చెందిన వారు ప్రాతినిధ్యం వహించారు! ప్రస్తుతం జరుగనున్న జడ్పీటీసీ ఎన్నికల్లో ఈ వర్గానికి రిజర్వేషన్ కేటాయింపు జరిగే అవకాశం వుండవచ్చు! అనే విషయంపై క్షేత్రస్థాయిలో చర్చ జరుగుతోంది. అలాగే ఎంపిపి కుర్చీకి ఈ ఎన్నికల్లో రిజర్వేషన్ ఏ వర్గానికి దక్కవచ్చు అని చర్చించుకుంటున్నారు. జడ్పీటీసీ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుండి ఓసి కేటగిరిలో ప్రస్తుత తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, ఆపై ఎస్సీ కేటగిరిలో కోణాపల్లి మనోహర్, బిసి మహిళ కేటగిరిలో యాదమరి శాంతకుమారి, ఓసీ మహిళ కేటగిరిలో ప్రస్తుత జడ్పీ వైస్ ఛైర్మన్ సతీమణి ఉష, ప్రస్తుతం ఓసి జనరల్ కేటగిరిలో జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి జడ్పిటిసీగా వున్నారు. ప్రస్తుతం జడ్పీటిసీగా బిసీ జనరల్ లేదా ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. అలాగే ఎంపిటీసీ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుండి యామదరి మండల ఎంపిపిలుగా ఎస్సీ జనరల్ కేటగిరిలో రాజమాణిక్యం, ఆపై బిసీ జనరల్ కేటగిరిలో సుందరమ్మ, ఓసీ జనరల్ కేటగిరిలో భూమిరెడ్డి ధనంజయరెడ్డి, బిసీ మహిళ కేటగిరిలో రాధామ్మ, ప్రస్తుతం ఎస్సీ జనరల్ కేటగిరిలో ఆర్.సురేష్‌బాబులు ఎంపిపిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఎంపిపి పదవికి వర్తింపజేసిన రిజర్వేషన్ల ప్రకారం ప్రస్తుతం ఎంపిపి పదవి ఓసి మహిళ లేదా ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశం కన్పిస్తుంది. అయితే జడ్పీటిసీ, ఎంపిపి పదవులు ఆశిస్తున్న అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వుండేవిధంగా మార్చుకోవడానికి ఇప్పటి నుండి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పరిస్థితుల్లో జడ్పీటిసీ, ఎంపిపి స్థానాలు ఈ వర్గానికి కేటాయించబడుతాయనే విషయంపై మండలంలో సర్వత్రా విస్తృతంగా చర్చ జరుగుతోంది.

## గంజాయి పాత నేరస్తులకు సీఐ కౌన్సెలింగ్

**రైల్వేకోడూరు రూరల్, జులై 19 ప్రభాతవార్త**



రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని గంజాయి కేసులలో ఉన్న పాత నేరస్తులకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని రైల్వే కోడూరు సిఐ చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి కేసుల్లో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులను పోలీస్ స్టేషనుకు పిలిపించి కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయం, రవాణా, నిల్వ మరియు వినియోగం చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి వల్ల యువత భవిష్యత్తు, కుటుంబాలు మరియు సమాజం తీవ్రంగా నష్టపోతారని వారు తెలియజేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత ముఖ్యమైనదని పేర్కొంటూ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సిఐ వెల్లడించారు.

## హాస్టల్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



**పుల్లంపేట, జులై 19 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన పుల్లంపేటలోని బాలుర వసతి గృహంలో ఆదివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో భాగంగా ప్రభుత్వ హాస్టల్లో ఉన్న బాలుర, బాలికల, ఉచిత బట్టలు, టీ షర్ట్స్, ప్యాంట్లు, బూట్లు సాక్షులు టవలు దుప్పటి, నైట్ డ్రస్సులు మొదలగు వస్తువులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డన్లు టి తిరుపతిరెడ్డి, ఎం కిరణ్ కుమార్ బాలికల వసతి గృహ అధికారిని పి రాణి, రైల్వే కోడూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నం శివయ్య, సింగం ఆదినారాయణ రెడ్డి, కేశినేని నారాయణ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



**చిట్వేలి, జులై 19 ప్రభాతవార్త:**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు, ఇతర సామాగ్రిని ఆదివారం వసతి గృహ విద్యార్థులకు అందజేశారు. వార్డెన్లు హరిప్రసాద్, సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ చంద్ర, ఎస్ఐ వినోద్ కుమార్, హెచ్ఎం దుర్గరాజు, రైల్వే కోడూరు అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వేమయ్య లు ముఖ్య అతిథులుగా పాల్గొని పిల్లలకు దుప్పట్లు, టవల్లు, స్పోర్ట్స్ బూట్లు, నైట్ టీ షర్ట్స్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు విద్యార్థులకు అన్ని వసతులను, సౌకర్యాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నాయని, ప్రతి విద్యార్థి పోటీ గుణంతో,ఉన్నత లక్ష్యంతో చదువుకుని గొప్ప స్థాయికి రావాలని పిలుపునిచ్చారు. వసతి గృహంలో ఆర్వో తాగు నీరు, స్నానానికి వేడి నీరు, పరిశుభ్రత, రుచికరమైన ఆహారం, ఉదయం సాయంత్రం పిల్లలను చదివించడం లాంటి వసతులను విద్యార్థులకు అందించడం సంతోషకర విషయం అని, వాటిని సాధించడంలో వార్డెన్లు హరి ప్రసాద్, సుబ్బరాజుల కృషిని ముఖ్య అతిథులు కొనియాడారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీ సుబ్రహ్మణ్యం రెడ్డి, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## రౌడీ షీటర్లకు సీఐ కౌన్సిలింగ్.

**చిట్వేలి, జులై 19,ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ మరియు రేణిగుంట డివిజన్ డిఎస్పి ఆదేశాల మేరకు రైల్వే కోడూరు రూరల్ పరిధిలోని చిట్వేలి, ఓబులవారిపల్లి, పెనగలూరు, పుల్లంపేట మండలాల లోని రౌడీ షీటర్లకు ఆదివారం సీఐ శ్రీనివాసులు తన కార్యాలయం నందు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సమాజంలో శాంతి, భద్రతలు నెలకొల్పడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు తమ ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి,కుటుంబ సభ్యులతో కలిసి గౌరవప్రదమైన జీవనం గడపాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, గొడవలు, బెదిరింపులు, దాడులు, సంఘవిద్రోహ చర్యలు మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యలకూ పాల్పడరాదని హెచ్చరించారు.ముఖ్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి రాజకీయ ప్రేరేపిత గొడవలు, బెదిరింపులు, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలు, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే కార్యకలాపాలు సహించబోమని స్పష్టం చేశారు. చట్టాలను గౌరవించి శాంతియుత జీవనం గడపాలని వ్యక్తిగత లేదా సామాజిక వివాదాలు తలెత్తినప్పుడు గొడవలకు పోకుండా పోలీసులను సంప్రదించాలని అన్నారు.మన తీరును బట్టి సమాజంలో కుటుంబానికి గౌరవం లభిస్తుందన్న సత్యాన్ని ప్రతి ఒక్కరు నమ్మాలని చట్ట

## పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబు శ్రద్ధ

**క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ**



**కుప్పం, జూలై 19 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని క్లస్టర్ ఇన్ చార్జ్ హైదర్ వలీ పేర్కొన్నారు. ఆదివారం మిట్టపల్లి పంచాయ తీలో అనారోగ్యంతో బాధపడు తున్న పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా సిఎంఆర్ఎఫ్ నిధులను సిఎం చంద్రబాబు కుప్పం ప్రజలకు మంజూరు చేస్తున్నారన్నారు. ఇది కుప్పం ప్రజల పట్ల సిఎంకు ఉన్న ఆప్యాయత అన్నారు. ఈసందర్భంగా లబ్దిదారులు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ లీలా వెంకటేష్, పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్, రెస్కో డైరెక్టర్ హారోగరన్, సీనియర్ నేతలు చలపతి, రఘుపతి, బాలకృష్ణ, శివప్రసాద్, కనకరాజు, నరసింహ, కనకరాజు, వెంకటేష్, సెల్వరాజ్, శివాజీ, సోమశేఖర్, నాగేష్, ఆనంద్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పూర్తయిన రాజుకాలువ నిర్మాణం



**కుప్పం, జూలై 19 ప్రభాతవార్త**

కుప్పం బస్టాండు ప్రాంతం నుంచి రాధాకృష్ణరోడ్ వరకు ఉన్న రాజు కాలువ నిర్మాణం పూర్తయింది. గతంలో రాతి కట్టడంతో ఉన్నఈ కాలువను సిమెంట్ కట్టడంతో నూతనంగా నిర్మించారు. ఈ కాలువ పక్కనే ముమ్ముందు చిన్నపాటి దుకాణాలను సైతం ఏర్పాటుచేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ రాజు కాలువను ఆధునీకరించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేంద్రం పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలి

**- బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్**



**శాంతిపురం, జూలై 19 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నేతలు, కార్యకర్తలు ప్రజల్లో తీసుకెళ్లాలని బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్ కోరారు. ఆదివారం శాంతిపురంలో జరిగిన బిజెపి మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24వతేదికి సర్ కార్యక్రమం ముగుస్తుందని ప్రజలు వందశాతం తమ ఓటు హక్కు ఉండేలా నేతలు చొరవ చూపాలన్నారు. పార్టీ రాష్ట్ర నేతల ఆదేశానుసారం ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీకోసం ఐక్యతతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కుమార్, నగేష్, వీరరాఘవరెడ్డి, శివ, శ్రీనివాసులు, శివకుమార్, మురుగేష్ పాల్గొన్నారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శిగా రమణప్ప

**బైరెడ్డిపల్లి, జూలై 19 ప్రభాతవార్త**

జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కుప్పనపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత రమణప్ప నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా ఇన్‌చార్జ్ గణేష్‌కుమార్ యాదవ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో దఫా తనకు ఈ పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల, కార్యదర్శి అనిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తీర్థం ఖాదర్ బాషా, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ప్రధాని సతీమణి మృతి పట్ల నేతల సంతాపం

**బైరెడ్డిపల్లి, జూలై 19 ప్రభాతవార్త**

మాజీ ప్రధాని దేవేగౌడ సతీమణి చెన్నమ్మ మృతి పట్ల మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కిషోర్ గౌడ్, కార్యదర్శి సు బ్రమణ్యం శెట్టి, మంజునాథ్‌గౌడ్, రాజీవ్ సాయి ప్రతాప్ గౌడ్, భాస్కర్ గౌడ్, పిసిసి కార్యదర్శి అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖాదర్ బాషా తదితరులు చెన్నమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## ఘనంగా కట్టపట్టాలమ్మకు పూజలు చేసిన కూటమి నాయకులు



**ఓబులవారిపల్లి, జూలై 19 ప్రభాతవార్త**

ఓబులవారిపల్లి మండలం మల్లంపేట అగ్రహారంలో శ్రీకృష్ణదేవరాయలు కాలం నాటి భక్తులు కోరికలు తీర్చే కొంగుబంగారమైన కట్ట పుట్టాలమ్మ జాతరలో కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, కూటమి నాయకులు ఆదివారం మంగంపేట అగ్రహారం వద్ద జరిగిన కట్టా పుట్టాలమ్మ జాతరలో పాల్గొని అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసన్నములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంగంపేట ఆలయ పెద్ద లు కమిటీ నాయకులు మంగంపేట గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి



**చిత్తూరుహెల్త్, జులై 19 ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత సాధించడం తప్పనిసరి చేయడంతో జిల్లా యుటిఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత టెట్ శిక్షణ శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి లాగా ఎప్పటికప్పుడు తాజా సమాచారంను విద్యార్థులకు మానవీయ కోణంలో మెలకువలు నేర్పించడం తదితర అంశాలను కలగలిపి బోధించడానికి సోపానంలా వుంటుందన్నారు. ఈ శిబిరం ఉదయం 6 నుండి 8 గంటల వరకు, ఆదివారం రోజు ఉదయం, సాయంత్రం సెషన్లుగా టెట్ పరీక్ష జరిగే వరకు కొనసాగుతుందని యుటిఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, జిల్లా నాయకులు రెడ్డప్పనాయుడు, పార్థసారధి, ఎస్పీ భాషా, రాష్ట్ర స్థాయిలో అనుభవం వున్న సైకాలజీ ఫ్యాకల్టీ శ్రీనివాసులు, గణితం ఫ్యాకల్టీ దేవేంద్రలతో పాటు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, జులై 19 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు హాజరైన తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు సమర్పిస్తే వారు సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను స్వీకరించి పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నేడు పోలీసు గ్రీవెన్స్

**చిత్తూరు, జులై 19 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుండి జరిగే ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ తుషార్ డూడి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును. అలాగే డివిజన్ కేంద్రాలు, మండల పోలీస్ స్టేషన్లలో డిఎస్పిలు, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐల ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి ఇచ్చిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

## డా.మురుగన్‌కు ఇంటర్నేషనల్ డాక్టరేట్ అవార్డులు



**పలమనేరు, జులై 19, ప్రభాతవార్త:**

పలమనేరు మున్సిపాల్టీ గంటావూరు బిసి కాలనీ గంగమ్మగుడి ఛైర్మన్ సేవారత్న డా.మురుగన్‌కు మరో రెండు ఇంటర్నేషనల్ డాక్టరేట్ ఆవార్డులు లభించాయి. పాండిచ్చేరిలో ఈ నెల 18న ఈ అవార్డులు అయన అందుకున్నారు. ఈయన చేసిన సామాజిక సేవలు గుర్తించి అమెరికన్ విస్డం పీస్ యూనివర్శిటీ మరియు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ తరపున ఈ అవార్డులు అభించాయి. ఇప్పటికే రెండు డాక్టరేట్ అవార్డులు ఉండగా కొత్తగా మరో రెండు ఇంటర్నేషనల్ అవార్డులు రావడం పట్ల డా.మురుగన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులు తన బాధ్యతను మరింత పెంచాయని ఆయన తెలిపారు. పుట్టుకతో ఎవరికీ పేరు ప్రతిష్టలు రావని తాము చేసే సామాజిక సేవా కార్యక్రమాల వల్లనే ఇది సాధ్యమని అన్నారు. ఇక గంగమ్మగుడి ఛైర్మన్‌గా ఈయన ఎన్నో సేవలందిస్తున్నారు. గుడి వద్ద ప్రతి మంగళ, ఆదివారాల్లో క్రమం తప్పకుండా అన్నదానం చేయిస్తున్నారు, కులమతాలకు అతీతంగా గుడులకు, మసీదులకు విరాళాలుగా ఆర్థిక సాయం అందజేసి వాటి అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఆర్థికంగా స్థోమతలేని నిరుపేదలకు తన సొంత ఖర్చులతో ఉచిత వైద్యం అందజేస్తున్నారు. ప్రతిఏటా గంగమ్మగుడి నుండి మేల్‌మరత్తూరు ఓం శక్తిగుడికి దాదాపు 10 బస్సులు ఏర్పాటు చేసి ఉచిత రవాణా భోజన ఖర్చులు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈయన చేసిన సేవలు గుర్తించి ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు రెండు డాక్టరేట్లు ప్రధానం చేశాయి.

## ఇక 108 వాహనంలో పాముకాటు మందులు

**పలమనేరు, జూలై 19, ప్రభాతవార్త:**

పాముకాటుకు ఇక 108 వాహనంలోనే మందులు లభిస్తాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు పాముకాటుకు విరుగుడు మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ లేదా ప్రవేటు ఆసుపత్రుల్లోనూ లభించేవి. ముఖ్యంగా రైతులు రాత్రి వేళల్లో పంటలకు నీరందించడానికి వెళ్ళేటపుడు ప్రమాదవశాత్తు పాముకాటుకు గురయ్యేవారు. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళే సరికి విష ప్రభావానికి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేవారు. దీంతో ప్రభుత్వం ఇక నుండి 108 వాహనంలోనే పాముకాటు విరుగుడు మందు ఏర్పాటు చేసింది. పామకాటు వేసినపుడు 108కు ఫోన్‌చేస్తే సిబ్బంది వెంటనే వారి వద్దకు వెళ్ళి మందులు అందజేస్తారు. ఉపశమనం తర్వాత పాముకాటుకు గురైన వారికి మెరుగైన చికిత్సలు చేస్తారు.

## బురుజు మునస్వామికి ఉప్పల దడియం రామ్మూర్తి అవార్డు

**పలమనేరు, జూలై 19, ప్రభాతవార్త:**



బాషా సేవకుడు, కవి, ప్రముఖ రచయిత కీ.శే. ఉప్పల రామ్మూర్తి స్మారక అవార్డుతో పాటు రూ.10 వేలు నగదును చిత్తూరుకు చెం దిన కవి, పండితుడు విద్వాన్ చలం కోట బురుజు మునస్వామికి అందజేయనున్నట్లు పలమనేరు రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ, అవార్డు వ్యవస్థాపకులు ఉప్పల దడియం నాగేశ్వర్ ప్రకటించారు. ఆగస్టు 2న ఉదయం 10 గంటలకు గంగవరం సాయిగార్డెన్ సిటీలోని కళా మందిర్‌లో జరిగే కార్యక్ర మంలో ఈ అవార్డును అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమా న్ని తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తులస నాధంనాయుడు, పుష్ప, పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడుమాధవ్,కార్యదర్శికుమారస్వామిరెడ్డి సమన్వ కర్త జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి నిర్వహిస్తారు.

## విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

**బైరెడ్డిపల్లి, జూలై 19 ప్రభాతవార్త**

మండలంలోని వెంగంవారిపల్లి గ్రామంలో ఆదివారం ఓ మహిళ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఈసంఘట నకు సంబంధించి వివరాలిలా.. తావడకుప్పంకు చెందిన జయమ్మ (65) తన పుట్టినిల్లు అయిన వెంగంవారిపల్లికి వచ్చి బంధువులతో ఉన్న సమయంలో కరెంట్ స్థంభం స్టే కంబీ తీగను పట్టుకోగా విద్యుత షాక్ తగిలి ఆమె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒక్కసారిగా హై ఓల్టేజ్‌లో విద్యుత్ సరఫరా సైతం రావడంతో పలు ఇళ్లల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైనట్లు చెప్పారు.



# శ్రీసిటీలోని అకార్డ్ స్కూలుకు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపు



## స్కూలు యాజమాన్యాన్ని అభినందించిన మంత్రి లోకేష్

**సత్యవేడు, జులై 19 ప్రభాతవార్త:**
శ్రీసిటీలోని అకార్డ్ స్కూలుకు యుకెకు చెందిన ప్రతిష్టాత్మక కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గుర్తింపు లభించింది. దీనిని అధికారికంగా ధృవీకరిస్తూ ఐఏ770 కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూలు నంబర్‌ను కేటాయించారు. దీంతో అకార్డ్ స్కూలులో ఇకపై కేంబ్రిడ్జ్ ప్రైమరీ(5–11 ఏళ్ళు), కేంబ్రిడ్జ్ లోయర్ సెకండరీ(11–14 ఏళ్ళు) విద్యా కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఈ గుర్తింపుతో విద్యార్థులకు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన పాఠ్యాంశాలు, అంతర్జాతీయ స్థాయి కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్ అసెస్‌మెంట్లు, ఉన్నత విద్యతో పాటు గ్లోబల్ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించే అవకాశం కలుగుతుంది. సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించేవిధంగా ఈ పాఠ్య ప్రణాళిక రూపొందించబడి ఉంటుంది. ఈ సందర్భంగా అకార్డ్ స్కూలు ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్ మాట్లాడుతూ కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నెట్‌వర్క్‌లో భాగస్వామ్యం కావడం తమకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను స్థానికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోను రాణించేలా తీర్చిదిద్దే విద్యను అందించేందుకు ఈ గుర్తింపు దోహదపడుతుందని చెప్పారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దీనిపై స్పందిస్తూ శ్రీసిటీ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలో విద్య ఒక కీలకమైన అంశమని పేర్కొన్నారు.

### స్కూలు యాజమాన్యానికి మంత్రి అభినందనలు

శనివారం శ్రీసిటీ హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసిన అకార్డ్ స్కూలు ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపును ఆయన దృష్టికి తెచ్చారు. స్కూలు యాజమాన్యాన్ని అభినందించిన మంత్రి, ఈ గుర్తింపు ప్రాంత విద్యా అభివృద్ధికి ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

## పెట్టుబడిదారుల ప్రోత్సాహంపై అవగాహన



**తిరుపతి,జులై 19ప్రభాతవార్త:**
పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీకి చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో నిధుల సమీకరణ ఇన్వెస్టర్ పిచ్ ప్రిపరేషన్ కోసం వినియోగం" అనే అంశంపై సదస్సు జరిగింది. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ వర్క్‌షాప్‌కు హాజరై, కీలకమైన అప్లికేషన్లు టూల్స్, ఆధారిత మార్కెట్ పరిశోధన, నిధుల సమీకరణ పిచ్ ప్రిపరేషన్‌లో ఇన్వెస్టర్లను కనుగొనడం వంటివాటిపై చర్చించారు. గ్రాంట్లు ఇంపాక్ట్ ఫండింగ్ కోసం పై కూడా దృష్టి సారించింది. విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ వై. భవానీ కుమార్ ఈ సెషన్‌కు అధ్యక్షత వహించి, నిధుల సమీకరణ ఇన్వెస్టర్ పిచ్ ప్రిపరేషన్ కోసం పద్ధతులను వివరించారు. కన్వీనర్ ఆచార్య సి.హెచ్.ఎం. కుమారి చిట్టూరి, కోకన్వీనర్ ప్రొఫెసర్ వి. సరిత సభ్యురాలు వి.జె. విజయ గీత ఈ సమావేశాన్ని నిర్వహించారు.

## బాలికల హాస్టల్ విద్యార్థినులకు
### శక్తిటీమ్ అవగాహన



**తిరుపతి,జులై 19ప్రభాతవార్త:**
రాష్ట్ర వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల హాస్టల్లో విద్యార్థినులకు పలు అంశాలపై సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత, మత్తు పదార్థాల నివారణపై అవగాహనతోబాటు పోక్సో చట్టం, బాల్య వివాహాలు, చైల్డ్ అబ్యూజ్, చైల్డ్ లేబర్‌పై చట్టపరమైన వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మహిళా అదనపు ఎస్పీ శ్రీలత ,సిఐ తమీమ్ అహ్మద్ శక్తి టీం పోలీసులు అవసరమైన అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

## వరాహమహాదేశికన్‌కు పెద్దమర్యాద



**తిరుమల,జులై 19ప్రభాతవార్తప్రతినిధి:**
శ్రీరంగం శ్రీమధన ఆండవన్ ఆశ్రమం పీఠాధిపతి వరాహమహాదేశికన్‌కు టిటిడి పెద్ద మర్యాదతో స్వాగతం పలికింది. ఆదివారం ఉదయం వరాహమహాదేశికన్ స్వామికి టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీ మహాశ్వేత వారాహిదేవి అలంకరణలో దర్శనం



**రామచంద్రాపురం, జూలై 19 ప్రభాతవార్త:**
శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న శ్రీ మహాశ్వేత వారాహిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వర మహాభారతి స్వామి, పీఠాధీశ్వరి రమ్యానంద భారతి అమ్మవారికి వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మహాశ్వేత వారాహిదేవి ప్రత్యేక మంత్ర హోమం నిర్వహించారు. శ్రీమూర్తులకు సువాసినీ పూజ, అమ్మవారికి మహాహారతి సమర్పించారు. మాతాజీ సమక్షంలో నవరాత్రి పూజ, దర్బారు సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి.కుమార్, పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ పెట్టుబడులకు ఉజ్జీవన్ బ్యాంక్ కొత్త వేదిక

**తిరుపతి విద్య జులై 19 ప్రభాత వార్త**
ఖాతాదారులకు సమగ్ర ఆర్థిక సేవలను అందించే దిశగా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ మ్యూచువల్ ఫండ్ పంపిణీ సేవలను ప్రారంభించింది. ఈ సేవల ద్వారా వినియోగదారులు సులభంగా, డిజిటల్ విధానంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని పొందనున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ రిటైల్ లయబిలిటీస్–టీఏఎస్, సీ అండ్ ఓ, పీపీ విభాగాధిపతి హితేంద్ర ఝా మాట్లాడుతూ, ఖాతాదారులకు పారదర్శకమైన, సులభమైన సంపద సృష్టి అవకాశాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. మ్యూచువల్ ఫండ్ పంపిణీ వేదిక ప్రారంభం ద్వారా బ్యాంక్ పూర్తి స్థాయి ఆర్థిక పరిష్కారాలను అందించే ప్రయాణంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని తెలిపారు. కొత్త సేవలు ఖాతాదారుల పెట్టుబడి అవసరాలను మరింత సమర్థంగా తీర్చగలవని ఆయన పేర్కొన్నారు.

## పెట్రోల్ ఖర్చుకు గుడ్‌బై.. అల్ట్రావయోలెట్ కొత్త ఆఫర్

**తిరుపతి విద్య, జులై 19 ప్రభాత వార్త**
పెరుగుతున్న పెట్రోల్ ధరలతో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులను విద్యుత్ వాహనాల వైపు మళ్లించేందుకు అల్ట్రావయోలెట్ కిల్ ది పెట్రోల్ బిల్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద ఎఫ్77 లేదా ఎక్స్47 మోడళ్లను కొనుగోలు చేసే వినియోగదారులకు, గత రెండేళ్లలో తమ పెట్రోల్ ద్విచక్ర వాహనంపై ప్రయాణించిన కిలోమీటర్ల ఆధారంగా గరిష్ఠంగా రూ.30 వేల వరకు క్యాష్‌బ్యాక్ అందించనుంది. ఉదాహరణకు 20 వేల కిలోమీటర్లు ప్రయాణించిన వారికి రూ.20 వేల వరకు ప్రయోజనం లభిస్తుంది.అలాగే ఈ వాహనాల వినియోగంతో నెలకు సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఇంధన ఖర్చు ఆదా అవుతుందని సంస్థ తెలిపింది. విద్యుత్ వాహనాల స్వీకరణను వేగవంతం చేయడం, వినియోగదారుల యాజమాన్య వ్యయాన్ని తగ్గించడం ఈ కార్యక్రమ లక్ష్యమని అల్ట్రావయోలెట్ సీఈఓ, సహవ్యవస్థాపకుడు నారాయణ్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, మెరుగైన పనితీరు, తక్కువ నిర్వహణ వ్యయంతో విద్యుత్ వాహనాలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే సంస్థ లక్ష్యమని ఆయన వివరించారు.

## నేటి నుంచి ఈఏపీసెట్ తొలి విడత కౌన్సెలింగ్
### 20 నుంచి 29 వరకు నమోదు..

**తిరుపతి విద్య జూలై 19 ప్రభాత వార్త**
రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి బీటెక్ ప్రవేశాల కోసం ఈఏపీసెట్ తొలి విడత కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 20 నుంచి 29 వరకు ఆన్‌లైన్ నమోదు చేపట్టనుండగా, 22 నుంచి 31 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 25 నుంచి 31 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఆగస్టు 1న వెబ్ ఆప్షన్ల మార్పులకు అవకాశం ఉండగా, 6న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 7 నుంచి 13లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.తిరుపతి జిల్లాలో ఎస్వీ విశ్వవిద్యాలయం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈఏపీసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమోలు, బదిలీ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఈడబ్ల్యూఎస్, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తదితర అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

## నేడు డయల్ యువర్ సిఎండి



**తిరుపతి, జులై 19ప్రభాతవార్త:**
విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనుంది. వినియోగదారులు 8977716661 నంబర్ కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఇకార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు.

## గోవింద ధామం
### నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



**తిరుపతి,జులై 19ప్రభాతవార్త:**
తిరుపతిలోని గోవింద ధామ్మం 2026–27 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడుగా హేమచందర్ మాగం , కార్యదర్శి గా వెంకటేష్ , కోశాధికారిగా ఏ, సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడుగా మునికృష్ణ , సంయుక్త కార్యదర్శిగా రామ్మోహన్ రెడ్డి, సహకోశా ధికారి రామకృష్ణారెడ్డి కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గోవింద ధామం అభివృద్ధి, సేవా కార్యక్రమాల విస్తరణ, ధార్మిక, సామాజిక కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం గోవింద ధామం ఆవరణలో నూతన కార్యవర్గ సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం బిజెపి నాయకులు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా కార్యక్రమాలతో గోవింద ధామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో వి. మునికృష్ణయ్య, సిరిగిరి ప్రకాష్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి ఏ. మోహన్, టి. రాము, వి.ఎం. లక్షీ ్మనారాయణ, గోపాల్ రెడ్డి, ఏ.వి. నిరంజన్, వాసు, గోపి, హేమ కిరణ్, కరాటే శీను తదితరులు, మిత్రబృందం మరియు గోవింద ధామం సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీశ్రీశ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి కృప అందరిపై ఉండాలి
### బియ్యపు శ్రీవాణి రెడ్డి.. కాటంరెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి...



**రేణిగుంట జూలై 19 ప్రభాతవార్త**
శ్రీశ్రీశ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి కరుణాకటాక్షాలు భక్తులందరిపై ఎల్లవేళలా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీ వాణిరెడ్డి, కుమార్తె కాటంరెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి ప్రార్థించారు. రేణిగుంట మండలం వెదళ్ళ చెరువు గ్రామంలో నిండుగా కొలువై భక్తుల కోర్కెలు తీరుస్తున్న శ్రీశ్రీశ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి శ్రీ వాణిరెడ్డి కుమార్తె కాటంరెడ్డి శ్రీ పవిత్ర ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవం నిర్వహికులు వారిని ఆహ్వానించి శాలువలు కప్పి సత్కరించి ప్రత్యేకగా పూర్ణకుంభంతో ఆహ్వానించి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భగవంతుని కృప ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని బియ్యపు శ్రీవాణి రెడ్డి, కాటం రెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి ప్రార్థించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు అత్తురు హరిప్రసాద్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, లోకనాథ్ రెడ్డి, గిరి, సుదర్శన్ రెడ్డి, గురవయ్య, చంగల్ రాయుడు, మల్లికార్జున, వేణు, మోహన్, కిషోర్, కేశవులు, దిలీప్, ఉమాశంకర్, సుబ్రహ్మణ్యం, శేషాద్రి, యోగానంద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివంగత హేమంత్‌కు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఘన నివాళి



**చంద్రగిరి, జూలై 19 ప్రభాతవార్త:**
కొత్తపాటి ధనప్రకాష్ రెడ్డి, మునిలక్ష్మి దంపతుల కుమారుడు దివంగత కొత్తపాటి హేమంత్ కుమార్ రెడ్డి (నాని) దశదిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నివాళులర్పించారు. మండల పరిధిలోని చిన్నరామాపురం పంచాయతీ, యల్లంపల్లి గ్రామంలో (చంద్రగిరి అక్కగార్ల కాలనీలో నివశిస్తున్న) జరిగిన హేమంత్ కర్మక్రియలకు యల్లంపల్లికి చేరుకున్న ఆయన హేమంత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంత్ తల్లిదండ్రులను, హేమంత్ చినాన్న, వైసిపి నాయకుడు కొత్తపాటి మదనమోహన్ రెడ్డిని ఆయన పరామర్శించారు. అదేవిధంగా కొటాలలో విరూపాక్షి చెంగారెడ్డి చిత్రపటానికి, ఏ.రంగంపేటలో మొక్కల వెంకటరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళ్ళరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు రాజయ్య, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్, వైస్ చైర్మన్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చంద్రగిరి మాజీ ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కొత్తపాటి కోటిరెడ్డి, పెరుమాళ్ళపల్లి మునీశ్వర్ రెడ్డి, విరూపాక్షి ప్రసాద్ రెడ్డి, దాసరి రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాదానం మహాదానం



**పుత్తూరు రూరల్, జూలై 19 ప్రభాతవార్త:**
శ్రీ సరస్వతి మాతసాంఘిక సేవా సమాజం గత 22సంవత్సరాలుగా గ్రామీణ పేద విద్యార్థులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు రూపొందిస్తూ వారి విద్యాభివృద్ధికి దోహదం చేస్తూ ఉందన్నారు. రామకృష్ణమరాజు, ఉన్నత పాఠశాలప్రధాన పుత్తూరులో సమాజ 23వ వార్షికోత్సవానికి ఆయన అధ్యక్షత వహిస్తూ వ్యవస్థాపకులు కీర్తి శేషులు మాడ మునిరత్నం అనంతరం అతని కుమారుడు మాడ ప్రసాద్ 100 మంది సభ్యుల సహకారంతో దీన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం ముదావాహం అన్నారు. ఈ సందర్భంగా సేవా సమాజం పుత్తూరు, నగరి, నింద్ర, నారాయణవనం మండలాల్లోని 18 పాఠశాలలకు 2,50,000 రూపాయలు విలువైన విద్యా సామగ్రిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో పాఠశాల, మండల స్థాయిలోప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 45 వేలు నగదు బహుమతులను, జ్ఞాపికలను బహుకరించారు. ఇద్దరు పేద విద్యార్థులకు ఇంటర్ రెండో సంవత్సరానికి 36 వేలు చెల్లించి తల్లిదండ్రులకు రసీదు అందజేశారు. నూతనంగా 6 మంది సంఘ సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం సంఘం సభ్యులు అందరికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం,రవిశంకర్, మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, వినోద్‌బాబు, ప్రసాద్‌శెట్టి, పార్థసారథి, రాధాకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, ప్రభాకర్‌రాజు, శ్రీనివాసులు, అమర్నాథరెడ్డి,రామ మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, మంగపతి, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి అగ్నిగుండప్రవేశం



**పుత్తూరురూరల్, జూలై 19 ప్రభాతవార్త:**
పుత్తూరు మండల పరిధిలోని వేపగుంట గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం ఆదివారంతో ముగిసింది. ఈ అంకాళపరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ళ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఆదివారం ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు చేశారు. అలాగే అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో గ్రామస్తులు ఊరేగింపుగా అంబలి ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల య ఆవరణలో పోతురాజు ముగ్గు భక్తులను ఆకట్టు కుంది. సాయంత్రం భక్తులు పసుపు బట్టలు ధరించి వేపాకు చేత పట్టుకుని అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలుచేసి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాలు నడుమ ఊరేగించారు. గ్రామంలో పలు చోట్ల అమ్మవారి విగ్రహాలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. అమ్మవారికి అడుగు అడుగునా కొబ్బరికాయలు కొట్టి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. అలాగే భక్తులకు ప్రసాదాలు అందించారు.వేపగుంట గ్రామస్తులు చుట్టు పక్కల గ్రామీణ ప్రాంత భక్తులు హాజరయ్యారు.

## కరుణా దేవి కి డాక్టరేట్



**తిరుపతి,జులై 19ప్రభాతవార్త:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని బి. కరుణా దేవి కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. అనురాధ తెలిపారు. ఆమె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌కు చెందిన ఆచార్య కె. మాధవి మార్గదర్శకత్వంలో డాక్టర్ గల్లా రజిత సహమార్గదర్శకత్వంలో "సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ ఐబుప్రోఫెన్ డెరివేటివ్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని బి. కరుణాదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. బి. కరుణాదేవికి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

# గంజాయిపై పోలీసుల దండయాత్ర




**రేణిగుంట, జూలై 19 ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో రూరల్ సీఐ మంజునాథరెడ్డి గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో గంజాయి తదితర డ్రగ్స్‌పై దండయాత్ర చేపట్టారు. దండయాత్ర 2.0 భాగంగా రేణిగుంట మండలం వినాయకపురంలో గంజాయి వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులకు ఆధునిక బయో కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ తదితర నిషేధిత మాదకద్రవ్యాల పై ప్రజలు విద్యార్థులు తల్లితండ్రులు ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని మాదకద్రవ్యాలను సేవించే వారిని అప్రమత్తం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి డ్రగ్స్ తదితర నిషేధిత మాదకద్రవ్యాలకు సంబంధిత సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఇవ్వాలన్నారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు, గంజాయికి అడిక్ట్ అయిన వారి వివరాలు తెలుసుకొని తల్లిదండ్రుల అనుమతితో వారిని రీహాబిటేషన్ సెంటర్ కు పంపి చికిత్స చేయిస్తామన్నారు. గంజాయి లాంటి మాదకద్రవ్యాల కు అలవాటు పడితే డబ్బులు కోసం ఎంతటి నేరానికైనా పాల్పడతారని అన్నారు. డ్రగ్స్ కు అలవాటుపడ్డ కుటుంబాలు మానసికంగా ఆవేదనకు గురికావడమే కాకుండా ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు సమాజంలో చులకన అవుతారని తెలిపారు. సమాజాన్ని గంజాయి, డ్రగ్స్, నిషేధిత పొగాకు ఉత్పత్తుల రహిత సమాజంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.

